

TG/TEL/25/A3731

నిజం
దృష్టి తెలుగు న్యూస్



హైదరాబాద్ | ఎడిటర్: వరుదు సుజాత | సంపుటి:-1 | సంచిక:-315 | పేజీలు:-4 | సోమవారం 23-11-2026

Hydrabab | Editer name : varudu sujatha | volume:01, | issue:315 | pages:04 | Monday - 23-10-2026

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ 90 సీట్లు గెలుచుకుంటుంది

- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 90 సీట్లు, కోటి ఓట్లు సాధిస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి
- రాహుల్ గాంధీని ప్రధానిని చేసేందుకు 15 లోక్‌సభ స్థానాలు గెలవాలని పార్టీ శ్రేణులకు పిలుపు
- గతంలో టీడీపీ, బీఆర్ఎస్ తరహాలోనే కాంగ్రెస్ కూడా పదేళ్లు అధికారంలో ఉంటుందని వ్యాఖ్య
- ప్రభుత్వంపై బహిరంగంగా మాట్లాడే నేతల తీరును నిశితంగా గమనిస్తున్నామని హెచ్చరిక
- తెలంగాణ చేపట్టిన కులగణన దేశానికే ఆదర్శంగా నిలిచిందని వెల్లడి


2లో

తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 90 స్థానాలు సాధించడంతో పాటు కోటి ఓట్లు పొంది తిరిగి అధికారాన్ని నిలబెట్టుకుంటుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో 15 లోక్‌సభ సీట్లు

హైదరాబాద్ కు బాంబు బెదిరింపులు.. అప్రమత్తమైన పోలీస్ శాఖ

- హైదరాబాద్‌లో బాంబు దాడులు చేస్తామంటూ బెదిరింపు ఈమెయిల్
- నగరవ్యాప్తంగా ముమ్మరంగా యాంటీ సబోటేజ్ తనిఖీలు
- వదంతులు నమ్మవద్దని నగర సీపీ విజ్ఞప్తి
- నిందితుల కోసం సైబర్ క్రైమ్ పోలీసుల ముమ్మర గాలింపు
- అనుమానం వస్తే వెంటనే 112 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచన


2లో

హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో బాంబు దాడులు జరపనున్నట్లు వచ్చిన ఒక బెదిరింపు ఈమెయిల్‌పై హైదరాబాద్ సిటీ పోలీసులు అత్యంత వేగంగా స్పందించారు. ఈమెయిల్ అందిన వెంటనే నగరవ్యాప్తంగా విస్తృత స్థాయిలో ముందుజాగ్రత్త

సిద్ధిపేట 'సదర్'లో హరీశ్ రావు జోష్.. ఫొటోలు ఇవిగో!

- సిద్దిపేటలో ఘనంగా నిర్వహించిన సదర్ వేడుక సందడి చేసిన మాజీ మంత్రి హరీశ్ రావు
- త్వరలో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా
- సర్వేలు సైతం బీఆర్ఎస్ పునరాగమనాన్ని స్పష్టం చేస్తున్నాయన్న నేత
- సోషల్ మీడియాలో సదర్ ఫొటోలను పంచుకున్న హరీశ్ రావు



సిద్దిపేట పట్టణంలో నిర్వహించిన సదర్ ఉత్సవాల్లో స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు పాల్గొని సందడి చేశారు. సంప్రదాయబద్ధంగా సాగిన ఈ వేడుకల్లో - మిగతా 2 లో

నవంబర్ చివరి వారంలో బంగాళాఖాతంలో మరో అల్పపీడనం!



- నవంబర్ 27 తర్వాత బంగాళాఖాతంలో ఆవర్తనం ఏర్పడే అవకాశం
- అల్పపీడనంగా బలపడే సూచనలు
- ఏపీకి ప్రస్తుతానికి తుపాను ముప్పు లేదన్న నిపుణులు
- శ్రీలంక లేదా తమిళనాడు వైపు వెళ్లే అవకాశాలే ఎక్కువ
- తూర్పు గాలులతో తెలుగు రాష్ట్రాల్లో తేలికపాటి వర్షాలు

దక్షిణ అండమాన్ సముద్రం, ఆగ్నేయ బంగాళాఖాతం పరిసరాల్లో నవంబర్ - మిగతా 2 లో

బంగారం కొనుగోళ్లు వాయిదా వేయాలన్న మోదీ సలహాకు వ్యాపార సంఘం కృతజ్ఞతలు

- కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలన్న బీజేపీ
- బంగారం కొనుగోళ్ల వాయిదాపై ప్రధాని మోదీ ఇచ్చిన సూచనను సమర్థించిన బీజేపీ
- కాంగ్రెస్ పార్టీ ప్రజలకు, వ్యాపారులకు క్షమాపణ చెప్పాలని బీజేపీ డిమాండ్
- ప్రధాని సూచనతో వ్యాపారులు నష్టాల బారిన పడకుండా కాపాడారన్న సీటీఐ
- కిలో బంగారంపై రూ. 65 లక్షల వరకు తగ్గిన ధరతో కొనుగోలుదారులకు ఊరట


2లో

బంగారం కొనుగోళ్లను కొంతకాలం వాయిదా వేసుకోవాలంటూ గతంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన సలహా వ్యాపారులను, మదుపర్లను భారీ నష్టాల నుంచి కాపాడిందని బీజేపీ పేర్కొంది. నాడు ప్రధాని

ముగియనున్న జేఈఈ మెయిన్ రిజిస్ట్రేషన్ గడువు

13 లక్షలు దాటిన దరఖాస్తులు



- నేటి రాత్రి 11:50 గంటలతో ముగియనున్న జేఈఈ మెయిన్ సాధారణ రిజిస్ట్రేషన్ గడువు
- ఇప్పటివరకు ఫీజు చెల్లించి ప్రక్రియ పూర్తి చేసుకున్న 13.10 లక్షల మంది అభ్యర్థులు
- మొత్తంగా 15 లక్షలకు పైగా అభ్యర్థుల నుంచి అందిన దరఖాస్తు ఫారమ్‌లు
- రేపటి నుంచి నవంబర్ 26 వరకు రూ.500 ఆలస్య రుసుముతో దరఖాస్తుకు అవకాశం

గుర్తింపు ధ్రువీకరణ సమస్యలు రాకుండా డిజిలాకర్ ద్వారా లాగిన్ కావాలని - మిగతా 2 లో

పెట్టుబడులు, ఉద్యోగాలపై చర్చకు సిద్ధమా?

జగన్‌కు మంత్రి నారా లోకేశ్ సవాల్

- కూటమి ప్రభుత్వంలో గ్లోబల్ బ్రాండ్లు భారీ పెట్టుబడులు పెట్టాయని వెల్లడి
- గూగుల్, రిలయన్స్, బ్రూక్‌ఫీల్డ్ వంటి దిగ్గజ సంస్థల ప్రాజెక్టుల వివరాలు ప్రస్తావన
- గతంలో ప్రాజెక్టులను అడ్డుకునేందుకు పిల్‌లు వేశారంటూ లోకేశ్ ఆరోపణ
- రాష్ట్ర అభివృద్ధిపై చర్చకు రావాలంటూ సోషల్ మీడియా వేదికగా పోస్ట్



ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ మరియు ఉద్యోగాల కల్పన అంశాలపై వైసీపీ అధినే జగన్ కు రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ బహిరంగ సవాల్ విసిరారు. - మిగతా 2 లో

దేశంలో 13 కోట్ల ఓట్లు తొలగించారు

- కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలన్న రేవంత్ రెడ్డి
- 2027 జనాభా లెక్కల్లో ఓబీసీ గణనను చేర్చాలని టీపీసీసీ పీఏసీ సమావేశంలో తీర్మానం
- ఓబీసీ గణన అంశంపై ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాయాలని పీసీసీ చీఫ్‌కు సీఎం సూచన
- సంక్రాంతి తర్వాత ఐదు నెలల పాటు పల్లె పల్లెకు 'ప్రజా బలం' కార్యక్రమం
- ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో కేంద్రం నుంచి రూ. 30,000 కోట్లు సాయం కోరిన ముఖ్యమంత్రి
- దేశవ్యాప్తంగా 13 కోట్లు తెలంగాణలో 71 లక్షల ఓట్లు తొలగించారంటూ సీఎం రేవంత్ ఆరోపణ



2027 జనాభా లెక్కల్లో ఓబీసీ (గాదీజ) గణనను తప్పనిసరిగా చేర్చాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) పొలిటికల్ అఫైర్స్ కమిటీ (పీఏసీ) సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే జనాభా లెక్కల్లో ఓబీసీ గణనను చేర్చాలంటూ ఈ సమావేశంలో కాంగ్రెస్ పీఏసీ తీర్మానాన్ని ఆమోదించింది. ఈ విషయమై ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్‌కు ముఖ్యమంత్రి సూచించారు. గత 100 ఏళ్ల చరిత్రలో మొదటిసారిగా తెలంగాణ ప్రభుత్వం కుల గణనను విజయవంతంగా చేపట్టిందని ఆయన గుర్తుచేశారు. రాష్ట్రంలో సంక్రాంతి పండుగ ముగిసిన తర్వాత 5 నెలల పాటు 'ప్రజా బలం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పార్టీ నేతలంతా ప్రతి గ్రామాన్ని సందర్శించాలని - మిగతా 2 లో

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ 90 సీట్లు గెలుచుకుంటుంది

మొదటిపేజీ తరువాయి – గెలుచుకుని, రాహుల్ గాంధీని దేశ ప్రధానిని చేసే బాధ్యతను తెలంగాణ కాంగ్రెస్ తీసుకోవాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో జరిగిన టీపీసీసీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ, సలహా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 92,35,833 ఓట్లు సాధించి 64 స్థానాలు గెలుచుకుందని, మిత్రపక్షమైన సీపీఐ ఒక స్థానం దక్కించుకుందని సీఎం గుర్తుచేశారు. గతంలో టీడీపీ, బీఆర్ఎస్ పార్టీలు వరుసగా రెండు పర్యాయాలు గెలిచినట్లే, కాంగ్రెస్ కూడా మళ్లీ గెలిచి పదేళ్ల పాటు అధికారంలో ఉంటుందని చెప్పారు. 2024 ఎన్నికలకు ముందే బీజేపీ 240 సీట్లకు మించి గెలవదని తాను చెప్పిన విషయం నిజమైందని పేర్కొన్నారు. ప్రభుత్వంపై బీఆర్ఎస్ అసత్య ప్రచారాలు చేస్తోందని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఇదే సమయంలో పార్టీ నాయకులకు కూడా ఆయన స్పష్టమైన హెచ్చరిక చేశారు. ప్రభుత్వంపై బహిరంగంగా నెగెటివ్ వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని, ఎవరు ఏం మాట్లాడుతున్నారో పార్టీ వద్ద పూర్తి సమాచారం ఉందని తెలిపారు. పార్టీ లైన్‌లో నడిచే వారికి భవిష్యత్తులో తగిన గుర్తింపు లభిస్తుందని చెప్పారు. సంక్రాంతి పండుగ తర్వాత ప్రభుత్వం నేరుగా ప్రజల్లోకి వెళ్లనుందని రేవంత్ రెడ్డి తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని చెప్పారు. తెలంగాణలో చేపట్టిన కులగణన దేశానికే ఆదర్శంగా నిలిచిందని, దీని ఆధారంగానే దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే కేంద్రానికి లేఖ రాశారని ఆయన వివరించారు.

బిజెపి కీసర డివిజన్ నూతన ప్రధాన కార్యదర్శిగా కొమ్ము చిరంజీవి నియామకం

యాద్గిరిపల్లి ప్రధాన చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల



కీసర నవంబర్ 22 సూర్య న్యూస్: కీసర డివిజన్ వన్ యాద్గారిపల్లి గ్రామానికి చెందిన కొమ్ము చిరంజీవి భారతీయ జనత పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియామకం చేయడం జరిగింది ఈ మేరకు బిజెపి కీసర డివిజన్ అధ్యక్షులు కోళ్ల బాల్రాజ్ యాదవ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన కొమ్ము చిరంజీవి యాగిరిపల్లి గ్రామంలో ప్రధాన చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల అర్పించారు ఈ కార్యక్రమంలో బిజెపి కార్యదర్శులు అంబేద్కర్ యూత్ సభ్యులు గాలిగల్లా శ్రీనివాస్ దాయర బాల నరసింహ తాటిపాముల నరేందర్ దాయర నవీన్ సతీష్ ప్రవీణ్ ఓంకార్ టింకు తదితరులు పాల్గొన్నారు

రూ.49 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



కుత్బుల్లాపూర్ నవంబర్ 22 సూర్య న్యూస్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని వినాయక నగర్‌లో రూ.49 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మాజీ శాసనసభ్యులు, కాంగ్రెస్ నాయకులు కూన శ్రీశైలం గౌడ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కూన మాట్లాడుతూ 2014 వరకు తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు ప్రస్తుతం ఎమ్మెల్యే 10 సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పటికీ ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని ఇప్పుడు ప్రభుత్వం వద్ద నిధులు లేవని విమర్శిస్తున్నారని, తాము జిల్లా ఇన్చార్జ్ మంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధులు తీసుకొచ్చి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తుంటే ఈ ఎమ్మెల్యే రోడ్ల నిర్మాణం పూర్తయినంక రిబ్బన్ కటింగ్ చేయడం సిగ్గుచేటని విమర్శించారు. నియోజకవర్గ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు సహకరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబు కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు నర్సింగ్ రావు, మురళి కృష్ణ, యాదగిరి, పాండు, నాగరాజు, కరీం, శివ రామ రాజు, ధనుంజయ్ నాయక్, చందన్, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కీసరలో ఘనంగా పల్స్ పోలియో కార్యక్రమం.. చిన్నారులకు పోలియో చుక్కలు



కీసర నవంబర్ 22 సూర్య న్యూస్ కీసర: చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు పల్స్ పోలియో చుక్కలు ఎంతో అవసరమని, ఐదేళ్లలోపు పిల్లలందరికీ తల్లిదండ్రులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని నాయకులు సూచించారు. కీసర డివిజన్--1 పరిధిలోని కీసర గ్రామంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నాయకపు మాధురి వెంకటేష్ ముదిరాజ్, కీసర డివిజన్--1 బీసీ సెల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిక్కుడు రమేష్ ముదిరాజ్, కీసర మండల సామాజిక సేవా కార్యకర్త తుడుం శ్రీనివాస్, కీసర గ్రామపంచాయతీ మాజీ వార్డు సభ్యులు శీలం మల్లేష్, గోరంటీ ప్రవీణ్ గ్రామ యువ నాయకులు సుమన్ బన్నీ పాల్గొన్నారు.ఈ సందర్భంగా నర్సులు, అంగన్‌వాడీ టీచర్లు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ఏ చిన్నారికీ పోలియో చుక్కలు వేయకుండా మిగిలిపోకూడదని నాయకులు కోరారు.

స్నేహితుని కుటుంబానికి అండగా నిలిచిన పూర్వ విద్యార్థులు,

అకాల మరణం చెందిన గడ్డం శ్రీనివాస్ కుటుంబానికి రూ.30,000/- వేల ఆర్థిక సహాయం అందజేత,



కీసర నవంబర్ 22 సూర్య న్యూస్ స్నేహబంధానికి నిజమైన అర్థం చాటిన 2005--2006 పదో తరగతి పూర్వ విద్యార్థులు స్నేహితుని మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేస్తూ, మానవత్వాన్ని చాటుకున్న 2005--2006 పదవ తరగతి పూర్వ విద్యార్థులు. తమ తోటి స్నేహితుడు గడ్డం శ్రీనివాస్ అకాల మరణంతో తీవ్ర దిగ్భ్రాంతికి గురైన పూర్వ విద్యార్థులు, ఆయన కుటుంబానికి అండగా నిలవాలనే సంకల్పంతో రూ.30,000/- రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. మేడ్చల్ జిల్లా భోగారం గ్రామానికి చెందిన గడ్డం శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఈ విషయం తెలుసుకున్న 2005--2006 పదవ తరగతి పూర్వ విద్యార్థులంతా ఒకచోట చేరి, తమ స్నేహితుని కుటుంబాన్ని పరామర్శించి, ఓదార్పునిచ్చి, మనోధైర్యం కల్పించారు. కుటుంబానికి తమ వంతుగా రూ.30,000/- ఆర్థిక సహాయం అందించి కష్టకాలంలో అండగా నిలిచారు. స్నేహితుని మరణం తమను తీవ్రంగా కలచివేసిందని, ఆయన కుటుంబం ఒంటరిగా భావించకుండా తామంతా అండగా ఉంటామని పూర్వ విద్యార్థులు తెలిపారు. స్నేహితుని జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, కుటుంబానికి అవసరమైన సమయంలో సహాయం చేయడం తమ బాధ్యతగా భావించామని పేర్కొన్నారు. స్నేహం అంటే కేవలం కలిసి చదువుకున్న రోజులు, కలిసి గడిపిన క్షణాలు మాత్రమే కాదు.. కష్టకాలంలో ఒకరికొకరు అండగా నిలవడం, బాధను పంచుకోవడం, ఆపదలో ఆదుకోవడమే నిజమైన స్నేహమని ఈ పూర్వ విద్యార్థులు తమ సేవాభావంతో చాటిచెప్పారు. అకాల మరణం చెందిన స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి, మానవత్వం, స్నేహబంధం, సామాజిక బాధ్యతకు నిదర్శనంగా నిలిచిన 2005--2006 పదో తరగతి పూర్వ విద్యార్థుల ప్రయత్నం పలువురి ప్రశంసలు అందుకుంటోంది. ఈ కార్యక్రమంలో పడమటి రాజిరెడ్డి, కిషోర్ ముదిరాజ్, పవన్, నరేష్ యాదవ్,భాను,ఉపేందర్, నాగిరెడ్డి,మహేష్ తదితరులు పాల్గొన్నారు..

హైదరాబాద్‌పై కాలుష్య పంజా ఢిల్లీతో పోటీపడుతున్న భాగ్యనగరం!



మొదటిపేజీ తరువాయి – ప్రమాదకర స్థాయికి పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. నగరం మొత్తం మీద ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ూూ×) 410గా నమోదవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ స్థాయి కాలుష్యం ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తాజా గణాంకాల ప్రకారం.. గాలిలోని అతి సూక్ష్మ ధూళి కణాలైన పీఎం 2.5 స్థాయులు సురక్షిత పరిమితి అయిన 60 మైక్రోగ్రాములకు బదులుగా 278 మైక్రోగ్రాములుగా నమోదయ్యాయి. అదేవిధంగా పీఎం 10 పరిమితి 100 మైక్రోగ్రాములు కాగా, ప్రస్తుతం 326 మైక్రోగ్రాములుగా ఉంది. ఇది సాధారణం కంటే దాదాపు మూడు నుంచి నాలుగు రెట్లు అధికం. ఈ స్థాయిలో కాలుష్యం కొనసాగితే ప్రజల ఆరోగ్యంపై, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులపై తీవ్ర ప్రభావం పడుతుందని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో కాలుష్య తీవ్రత ఉన్నప్పటికీ, ముఖ్యంగా పశ్చిమ హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్ పరిధిలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. డిఫెన్స్ కాలనీలో ూూ× ఏకంగా 685గా రికార్డయింది. శేరిలింగంపల్లిలో 666, మణికొండలో 602, యాంబియన్స్ ఫోర్ట్‌లో 596, ఎన్‌బీటీ నగర్‌లో 582గా కాలుష్య సూచీ నమోదైంది. ఈ ప్రాంతాలు కాలుష్య హాట్‌స్పాట్‌లుగా మారుతుండటం స్థానికులను భయాందోళనలకు గురిచేస్తోంది. హైదరాబాద్‌లో గాలి నాణ్యత ఇంతలా క్షీణించడానికి ప్రధాన కారణాలు పెరిగిన వాహనాల రద్దీ, అదుపులేని నిర్మాణ కార్యకలాపాలు, రోడ్లపై పేరుకుపోయిన దుమ్ముధూళి, పారిశ్రామిక ఉద్గారాలేనని అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా ఐటీ కారిడార్‌లో నిరంతరాయంగా సాగే నిర్మాణాలు, వాహనాల రాకపోకలు కాలుష్య తీవ్రతను మరింత పెంచుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలని పౌరులు, పర్యావరణవేత్తలు కోరుతున్నారు. రోడ్లను నీటితో శుభ్రపరచడం, నిర్మాణ ప్రాంతాల్లో దుమ్ము లేవకుండా చర్యలు తీసుకోవడం, వాహన కాలుష్య తనిఖీలను కఠినతరం చేయడం వంటివి వెంటనే ప్రారంభించాలని సూచిస్తున్నారు. లేకపోతే హైదరాబాద్ కూడా ఢిల్లీ లాగా గ్యాస్ ఛాంబర్‌గా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సిద్ధిపేట 'సదర్'లో హరీశ్ రావు జోష్.. ఫొటోలు ఇవిగో!





మొదటిపేజీ తరువాయి – ఆయన యాదవ సోదరులతో కలిసి ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. స్థానిక ప్రజలు, యువతతో మమేకమై పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జరిగిన ఊరేగింపులో హరీశ్ రావు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తలపాగా ధరించి, చేతిలో హాకీ బ్యాట్ పట్టుకుని పైకెత్తుతూ యువతతో కలిసి జోష్ ప్రదర్శించారు. తనకు బహూకరించిన కత్తిని గాల్లోకి దూశారు. సిద్దిపేటలో జరిగిన ఈ సదర్ వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందాన్ని, సంతృప్తిని ఇచ్చిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలను ఆయన సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ఉత్సవాల అనంతరం హరీశ్ రావు మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో త్వరలోనే బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన పలు సర్వేలు సైతం ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజలు బీఆర్ఎస్ పాలనను కోరుకుంటున్నారని ఆయన స్పష్టం చేశారు. ఇదే సమయంలో సిద్దిపేట రాజకీయాల ప్రస్తావన రావడంతో వేదికపై సవాళ్లు, ప్రతిసవాళ్లు చోటుచేసుకున్నాయి. స్థానిక అభివృద్ధిపై ఎవరైనా చర్చకు రావచ్చంటూ నాయకులు ఒకరికొకరు సవాళ్లు విసురుకోవడంతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఏదేమైనా, సంప్రదాయ ఉత్సవాలను ప్రజలంతా కలిసికట్టుగా, ఉల్లాసంగా జరుపుకోవడం అభినందనీయమని హరీశ్ రావు పేర్కొన్నారు.

దేశంలో 13 కోట్ల ఓట్లు తొలగించారు



మొదటిపేజీ తరువాయి – పిలుపునిచ్చారు. నాయకులకు నిర్దిష్ట బాధ్యతలు అప్పగిస్తామని, నిధుల కొరత లేకుండా చూస్తామని తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులకు ఇప్పటికే సముచిత పదవులు దక్కాయని ఆయన పేర్కొన్నారు. ఇదే సమయంలో, తెలంగాణ నూతన ఏఐసీసీ ఇన్‌ఛార్జ్‌గా నియమితులైన బి.ఎం. సందీప్‌కు ముఖ్యమంత్రి స్వాగతం పలికారు. సీనియర్ నాయకుడిని రాష్ట్ర ఇన్‌ఛార్జ్‌గా నియమించినందుకు సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న సహాయక చర్యల గురించి ముఖ్యమంత్రి వివరించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల సరిపడా వర్షపాతం నమోదు కాలేదని, ఈ పరిస్థితులను అధిగమించడానికి కేంద్రం రూ. 30,000 కోట్లు ఆర్థిక సాయం అందించాలని కోరారు. రైతులు ఆరుతడి పంటలనే సాగు చేయాలని విజ్ఞప్తి చేస్తూ, రాష్ట్రంలో ఆహార ధాన్యాల కొరత ఏమీ లేదని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా 100 దేశాలు, మన పొరుగున ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక సైతం తీవ్ర కరవును ఎదుర్కొంటున్నాయని గుర్తుచేశారు. రాబోయే 8 నెలల పాటు తాగునీటి సరఫరాకు ఇబ్బంది రాకుండా ప్రాజెక్టుల్లోని నీటి వనరులను పూర్తిగా తాగునీటి అవసరాలకే కేటాయిస్తున్నామని వెల్లడించారు. వర్షాకాలంలో విద్యుత్ డిమాండ్ 20,000 మెగావాట్లకు చేరినప్పటికీ, విద్యుత్ కోతలు లేకుండా సరఫరా చేసి పంటలను కాపాడామని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం మరో పెద్ద కార్యక్రమాన్ని చేపట్టనుందని, ఇప్పటికే ఉపాధి హామీ పథకంలో లబ్ధిదారుల సంఖ్య భారీగా పెరిగిందని తెలిపారు. ఓట్ల తొలగింపు వ్యవహారంలో ప్రధాని నరేంద్ర మోదీపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచే దళితులు, ఆదివాసీలు, గిరిజనులు, మహిళల ఓట్లను వలసల పేరుతో తొలగిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఎస్ఐఆర్ (ూ×=) ముసుగులో కేంద్రం ఓట్లను గల్లంతు చేస్తోందని విమర్శించారు. దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లు, ఒక్క తెలంగాణలోనే 71 లక్షల ఓట్లను తొలగించారని సీఎం పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో 'సైమన్ గో బ్యాక్' తరహాలోనే, ఇప్పుడు కాంగ్రెస్ శ్రేణులు 'జ్ఞానేశ్ కుమార్ గో బ్యాక్' నినాదంతో పోరాడాలని పిలుపునిచ్చారు. ఇంటిపేరులో చిన్న తేడా వచ్చినా ఓట్లను తొలగిస్తున్నారని, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, బీఎల్‌వోలు ఓట్ల తొలగింపుపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. బీజేపీ దేశంలో ఓటు హక్కు ఉన్నవారు, లేనివారుగా రెండు వర్గాలుగా విభజిస్తూ, ప్రజలను ద్వితీయ శ్రేణి పౌరులుగా మారుస్తోందని ఆయన ఆరోపించారు.

ప్రధాని మోదీతో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కీలక ఫోన్ సంభాషణ

మొదటిపేజీ తరువాయి – రష్యా-ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధ సంక్షోభాన్ని కేవలం చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే పరిష్కరించుకోవాలని భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ సోమవారం సాయంత్రం ప్రధాని మోదీతో టెలిఫోన్‌లో మాట్లాడారు. ఈ సంభాషణకు సంబంధించిన వివరాలను భారత ప్రధానమంత్రి కార్యాలయం అధికారికంగా విడుదల చేసింది. పీఎంఓ ప్రకటన ప్రకారం.. రష్యాతో నెలకొన్న ప్రస్తుత యుద్ధ పరిణామాలపై తన అభిప్రాయాలను అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రధాని మోదీతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, సమస్యల పరిష్కారంలో భారత్ ఎల్లప్పుడూ అనుసరించే 'మానవతా దృక్పథాన్ని' (ఎబఝుఅ-ఎవఱ్‌తీఅఎ ఖజూజూతీఝీఎష్ట్ర) పునరుద్ఘాటించారు. వివాదాలను కేవలం చర్చలు, దౌత్యం ద్వారానే పరిష్కరించుకోవాలనేది భారత్ యొక్క స్థిరమైన విధానమని స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో శాంతిని పునరుద్ధరించేందుకు ఉద్దేశించిన అన్ని రకాల ప్రయత్నాలకు తమ వంతు సహకారం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని ప్రధాని తెలిపారు. అలాగే, ఇరు దేశాల ప్రజల ప్రయోజనాల దృష్ట్యా వివిధ రంగాలలో భారత్-ఉక్రెయిన్ ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవడంపై కూడా నేతలిద్దరూ చర్చించారు. మరోవైపు, ఈ ఫోన్ సంభాషణపై ఉక్రెయిన్ అధ్యక్ష కార్యాలయం కూడా ఒక ప్రకటన విడుదల చేసింది. యుద్ధాన్ని ముగింపు దశకు తీసుకువచ్చేందుకు అవసరమైన దౌత్య ప్రక్రియలు, తదుపరి చర్యలపై ప్రధాని మోదీతో చర్చించినట్లు పేర్కొంది. రాబోయే అబూదాబీ సమావేశ ఎజెండా కోసం ఉక్రెయిన్ సిద్ధమవుతోందని జెలెన్‌స్కీ తెలిపారు. ఉక్రెయిన్ ఎల్లప్పుడూ నిర్మాణాత్మక వైఖరితోనే ఉందని, రష్యా నుంచి కూడా యుద్ధ ఉద్రిక్తతలను తగ్గించే విధంగా అలాంటి చొరవే అవసరమని ఆయన పేర్కొన్నారు. "ఇది యుద్ధాన్ని కొనసాగించాల్సిన సమయం కాదు.. ముగించాల్సిన సమయం అని రష్యా నాయకత్వంతో సహా అందరికీ ప్రధాని మోదీ గతంలో పలుమార్లు స్పష్టంగా చెప్పారు. ఈ నేపథ్యంలో యుద్ధానికి ముగింపు పలికేలా భారత్ తన వంతుగా ఎలాంటి చర్యలు తీసుకోగలదో గుర్తించడం, ఇతర దేశాల నాయకులతో సంప్రదింపులు జరపడం ఎంతో కీలకం" అని జెలెన్‌స్కీ వ్యాఖ్యానించారు. నల్ల సముద్రంలో నిలిచిపోయిన ధాన్యపు ఎగుమతులు, ఆహార భద్రత అంశంపై కూడా ఇరువురు నేతలు చర్చించారు. ఆహార రవాణా కారిడార్ల పునరుద్ధరణలో మధ్యవర్తిత్వం వహించేందుకు భారత్ సిద్ధంగా ఉందని, ఈ విషయంలో భారత్ చేసే ప్రయత్నాల కోసం తాము ఎదురుచూస్తున్నామని ఉక్రెయిన్ తెలిపింది. సముద్ర మార్గాలను అడ్డుకోవడం వల్ల రష్యా ఆర్థిక వ్యవస్థతో పాటు వివిధ దేశాల్లోని కోట్లాది మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జెలెన్‌స్కీ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల అట్లాంటాలో జరిగిన జీ20 విదేశాంగ మంత్రుల సదస్సు సందర్భంగా భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ మాట్లాడుతూ, ఈ సంక్షోభ పరిష్కారం కోసం భారత్ నిరంతరం ప్రయత్నిస్తోందని వెల్లడించారు. పౌర నౌకలు మరియు నావికులపై దాడులు జరగకుండా చూడటం, నల్ల సముద్రం ద్వారా ధాన్యపు ఎగుమతులను పునరుద్ధరించడం, అలాగే ఇంధన మౌలిక వసతులపై దాడులు జరగకుండా చూడటం అనే మూడు ప్రధాన అంశాలపై భారత్ రష్యా, ఉక్రెయిన్ మరియు యూరప్ దేశాలతో చర్చిస్తోందని తెలిపారు.

పెట్టుబడులు, ఉద్యోగాలపై చర్చకు సిద్ధమా? జగన్‌కు మంత్రి నారా లోకేశ్ సవాల్



మొదటిపేజీ తరువాయి – కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి వచ్చిన భారీ పెట్టుబడులు, ఏర్పాటవుతున్న ప్రాజెక్టుల వివరాలను వెల్లడిస్తూ ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు.రాష్ట్రంలో వివిధ రంగాలకు చెందిన అంతర్జాతీయ, జాతీయ స్థాయి అగ్రశ్రేణి సంస్థలు పెట్టుబడులు పెట్టాయని, తద్వారా వేలాది మంది యువతకు ఉద్యోగావకాశాలు లభించాయని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యువత భవిష్యత్తు కోసం పరిశ్రమలను రప్పించే ప్రయత్నం చేస్తుంటే, గత పాలకులు ప్రాజెక్టులను అడ్డుకోవడానికి న్యాయస్థానాల్లో పిటిషన్లు వేశారని, ఆ తర్వాత మళ్లీ ప్రాజెక్టుల క్రెడిట్ తమ ఖాతాలో వేసుకునేందుకు ప్రయత్నించారని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా 2024-26 కాలానికి సంబంధించిన పారిశ్రామిక ప్రగతి వివరాలను మంత్రి పంచుకున్నారు. అందులో గూగుల్ (రూ. 1,33,000 కోట్లు), ఏఎం/ఎన్ఎస్ ఇండియా (రూ. 1,36,000 కోట్లు), బ్రూక్‌ఫీల్డ్ (రూ. 1,06,000 కోట్లు), రిలయన్స్ (రూ. 43,000 కోట్లు), రెన్యూ, వారీ, ప్రీమియర్ ఎనర్జీస్, అల్ట్రాటెక్, దాల్మియా భారత్, అమరావతి క్వాంటమ్ వ్యాలీ, టాటా, ఐబీఎం, కాగ్నిజెంట్ తదితర సంస్థల ప్రాజెక్టులు వివిధ దశల్లో (కమిషన్డ్, నిర్మాణంలో, ఆపరేషనల్) ఉన్నట్లు ఆ జాబితాలో చూపించారు. ఈ వివరాలను ప్రస్తావిస్తూ.. "ఇది మా ట్రాక్ రికార్డ్. పరిశ్రమల పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన మరియు రాష్ట్ర అభివృద్ధిపై పూర్తిస్థాయిలో చర్చించేందుకు నేను సిద్ధంగా ఉన్నాను. నా సవాల్‌ను స్వీకరించడానికి మీరు సిద్ధమేనా?" అంటూ జగన్‌ను ఉద్దేశించి మంత్రి నారా లోకేశ్ ప్రశ్నించారు.

యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు జర్నలిస్టులు కాదు



నిజం న్యూస్ హైదరాబాద్, నవంబర్ 22,2026: జర్నలిస్టులకు కల్పించే ప్రత్యేక రక్షణలు, చట్టపరమైన వెసులుబాట్లు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు వర్తించవు!

సుప్రీంకోర్టుకు స్పష్టం చేసిన ఢిల్లీ పోలీసులు. సోషల్ మీడియా వేదికగా వార్తలు, వీడియోలు, అభిప్రాయాలు, విశ్లేషణలు ప్రచురిస్తున్నంత మాత్రాన యూట్యూబర్లు, డిజిటల్ కంటెంట్ క్రియేటర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను జర్నలిస్టులుగా గుర్తించలేమని ఢిల్లీ పోలీసులు సుప్రీంకోర్టుకు వెల్లడించారు. జర్నలిస్టులకు వారి వృత్తిపరమైన విధుల నిర్వహణలో కొన్ని ప్రత్యేక చట్టపరమైన రక్షణలు, హక్కులు ఉంటాయని, అవే రక్షణలను యూట్యూబర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లు కోరలేరని పోలీసుల వాదనగా తెలుస్తోంది.

ఈ అంశం ఇప్పుడు డిజిటల్ మీడియా ప్రపంచంలో కీలక చర్చకు దారితీస్తోంది.

సోషల్ మీడియాలో వార్తలు ప్రచురించే ప్రతి ఒక్కరూ జర్నలిస్టులేనా?

జర్నలిజానికి వృత్తిపరమైన అర్హతలు, బాధ్యతలు అవసరమా?

భావప్రకటనా స్వేచ్ఛకు, జర్నలిస్టుల వృత్తిపరమైన రక్షణకు మధ్య ఉన్న తేడా ఏమిటి?

ఫేక్ న్యూస్, నిరాధార ఆరోపణలు, వ్యక్తిగత దూషణలకు ఎవరు బాధ్యత వహించాలి?

మల్లారెడ్డి కాలనీ సొసైటీ కార్యాలయంలో పోలియో చుక్కల కార్యక్రమం ప్రారంభం



నిజం న్యూస్ బీరంగూడ, హైదరాబాద్ నవంబర్ 22,2026: బీరంగూడ డివిజన్ మల్లారెడ్డి కాలనీ సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని అమీన్‌పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శశిధర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సంధ్భంగా కాలనీ వాసులు లక్ష్మీకాంత్, చుక్క రెడ్డి, ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన సూచించారు.

పిల్లల బంగారు భవిష్యత్తుకు ప్రతి ఒక్కరూ పల్స్ పోలియో చుక్కలు వేయించాలి: ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



నిజం న్యూస్ కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 22,2026: సబ్ నేషనల్ ఇమ్యూనిజేషన్ డే ను పురస్కరించుకొని ఆదివారం 132 – జీడిమెట్ల డివిజన్ కుత్బుల్లాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ పాల్గొని చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలను వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....పిల్లల బంగారు భవిష్యత్తుకు రెండు చుక్కల పల్స్ పోలియో చుక్కలు తప్పక వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రిషిత, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: బండి రమేష్



నిజం న్యూస్ కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 22,2026: చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ పేర్కొన్నారు. ఆదివారం మూసాపేట్ డివిజన్ పరిధిలోని బస్తీ దవాఖానాలో నిర్వహించిన పోలియో చుక్కల కార్యక్రమానికి బండి రమేష్ హాజరై చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. పోలియో వ్యాధి బారిన పడకుండా చిన్నారులకు సకాలంలో పోలియో చుక్కలు వేయించడం ఎంతో ముఖ్యమని అన్నారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, చిన్నారుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మయ్య, డివిజన్ అధ్యక్షులు తూము సంతోష్, శంకర్, మస్తాన్ రెడ్డి, శివకుమార్ గౌడ్, చంద్రరావు, నాగార్జున, షహేన్షా, ఎంసీ డైరెక్టర్ ఇజాజ్, కూకట్‌పల్లి నియోజకవర్గ మైనారిటీ చైర్మన్ చన్ను పాషా తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి ట్రక్ పార్క్, హౌసింగ్ బోర్డు భూములను అమ్మితే సహించేది లేదు: మాధవరం కృష్ణారావు



నిజం న్యూస్ కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 22,2026: ప్రజా అవసరాల కోసం కేటాయించిన భూములను కాపాడుకునేందుకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ , సిపిఐ, సిపిఎం, శాంతియుత నిరాహార దీక్ష ప్రారంభం.. భవిష్యత్తులో పెరగనున్న పది లక్షల జనాభాకు ఆటస్థలాలు, పార్కులు, మౌలిక సదుపాయాలకు స్థలాలు ఎక్కడి నుంచి తెస్తారు? బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ భూములను ప్రజా అవసరాలకే వినియోగిస్తాం: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

భూములను అమ్మితే ఎంతటి పోరాటానికైనా సిద్ధం: సీపీఐ, సీపీఎం నాయకులు

కూకట్‌పల్లి ప్రజల భవిష్యత్తు అవసరాల కోసం కేటాయించిన ట్రక్ పార్క్ భూములు, హౌసింగ్ బోర్డు భూములను అమ్మవద్దంటూ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌తో పాటు సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్)చీన వామపక్ష పార్టీల నాయకులు ఆదివారం ట్రక్ పార్క్ సమీపంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద ఐక్యంగా శాంతియుత నిరాహార దీక్షను ప్రారంభించారు. ఈ దీక్షలో పెద్ద ఎత్తున ప్రజలు, మాజీ కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కూకట్‌పల్లి ప్రాంతంలో ప్రజా అవసరాల కోసం కేటాయించిన భూములను కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మేందుకు ప్రయత్నించడం దుర్మార్గమని విమర్శించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ భూములను అమ్మనివ్వబోమని, ప్రజల ఆస్తులను కాపాడుకునేందుకు ఐక్యంగా పోరాడతామని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో కూకట్‌పల్లి నియోజకవర్గంలో జనాభా దాదాపు పది లక్షలకు చేరుకునే అవకాశం ఉందని, ఇంత పెద్ద సంఖ్యలో ఉండే ప్రజలకు అవసరమైన పార్కులు, ఆటస్థలాలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలంటే ప్రభుత్వ భూములు అవసరమని పేర్కొన్నారు. భవిష్యత్తు తరాల అవసరాలను పట్టించుకోకుండా ఇప్పుడున్న భూములను అమ్ముకుంటే రాబోయే తరాలకు ఆటస్థలాలు, పార్కులు ఎక్కడి నుంచి తీసుకొస్తారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎన్నో ఏళ్లుగా ప్రజా అవసరాల కోసం ఈ భూములను కాపాడుకుంటూ వస్తుంటే, ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వాటిని అమ్మేందుకు ప్రయత్నించడం ఏమిటని స్థానిక ప్రజలు, నాయకులు ప్రశ్నించారు. ప్రజలకు ఉపయోగపడాల్సిన భూములను వ్యాపార ప్రయోజనాల కోసం వేలం వేయడం సరైన విధానం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్క గజం భూమిని కూడా అమ్ముకుండా ప్రజల భవిష్యత్తు అవసరాల కోసం కాపాడుకుంటూ వచ్చామని తెలిపారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పార్కులు, ఆటస్థలాలు, ఇతర మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వ భూములను పరిరక్షించామని పేర్కొన్నారు. తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ భూములను ప్రజా అవసరాలకే వినియోగించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సీపీఐ, సీపీఎం తదితర వామపక్ష పార్టీల నాయకులు మాట్లాడుతూ.. ప్రజలకు చెందాల్సిన భూములను రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎలా అమ్ముతుందని ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ భూముల అమ్మకాన్ని అంగీకరించేది లేదని, ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు ప్రజలతో కలిసి పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అవసరమైతే ఎంతటి పోరాటానికైనా సిద్ధమని హెచ్చరించారు. కూకట్‌పల్లి ప్రజల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ట్రక్ పార్క్, హౌసింగ్ బోర్డు భూములను కాపాడుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని, పార్టీలకు అతీతంగా ప్రజలందరూ ఈ పోరాటంలో భాగస్వాములు కావాలని నాయకులు పిలుపునిచ్చారు...ఈ కార్యక్రమంలో దీ-నా కోఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, ఆవుల రవీందర్ రెడ్డి, ముద్దం నరసింహ యాదవ్, పగడాల బాబు రావు, సబిహా గౌసుద్దీన్ , తూము శ్రావణ్ కుమార్, మందాడి శ్రీనివాస్ రావు, పండాల సతీష్ గౌడ్, మాధవరం రంగారావు, జ్ఞావీ పార్టీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఐలాపురం రాజశేఖర్, జ్ఞా× కూకట్పల్లి మండల కార్యదర్శి జి. కృష్ణ, జ్ఞా×మీ చీన, నాయకురాలు అనురాధ, ప్రజాసంఘాల నాయకులు వివి రావు, జ్ఞా×(మీ) మాల్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సదానందం ఈరిలే నిరాహార దీక్ష కు మద్దతుగా సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు జ్యోతి,జ్ఞా×మీ చీన కేంద్ర కమిటీ సభ్యులు నాగేశ్వరావు, వామపక్ష పార్టీ నాయకులు ఎం. శంకర్, వెంకట్ రెడ్డి చారీ పాల్గొన్నారు...

పోలియో రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి

ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

హనుమకొండ లోని ప్రభుత్వ మెటర్నిటీ ఆసుపత్రిలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్



హనుమకొండ టౌన్ నవంబర్ 22 నిజం న్యూస్ : పోలియో మహమ్మారిని దేశం నుంచి నిర్మూలించినప్పటికీ, భవిష్యత్తులో ఆ వ్యాధి మళ్లీ ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు.ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి వారి ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు భరోసా కల్పించాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ప్రభుత్వ మెటర్నిటీ ఆసుపత్రిలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి ఎంపీ డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మూడేళ్ల కుమార్తెకు ఎంపీ స్వయంగా పోలియో చుక్కలు వేశారు. అనంతరం ఇతర చిన్నారులను ఆప్యాయంగా పలకరిస్తూ,వారిని ఎత్తుకొని పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ పోలియో మైలిటిస్ వ్యాధి చిన్నారులను జీవితాంతం అంగవైకల్యానికి గురిచేసే ప్రమాదకరమైన వ్యాధి అని పేర్కొన్నారు. భారతదేశం 2014లోనే పోలియో రహిత దేశంగా ప్రకటించబడినప్పటికీ, ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా ప్రభుత్వం పల్స్ పోలియో కార్యక్రమాన్ని కొనసాగిస్తోందన్నారు. గతంలో పోలియో చుక్కలు వేసినా, వేయకపోయినా ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి ఈ కార్యక్రమంలో ఉచితంగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలోనూ ప్రయాణికుల కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. వరంగల్‌ను మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగంలో మౌలిక సదుపాయాలను విస్తరిస్తోందని తెలిపారు.ఇందులో భాగంగా 24 అంతస్తులతో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మిస్తున్న వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి త్వరలో అందుబాటులోకి రానుందని వెల్లడించారు. జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రులను కూడా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఆరోగ్యశ్రీ పథకం చికిత్స పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు గుర్తుచేశారు. ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. హనుమకొండ జిల్లాలో సిజేరియన్ ప్రసవాల సంఖ్యపై ఎంపీ ఆందోళన వ్యక్తం చేశారు.సాధారణ ప్రసవాలపై గర్భిణులు, వారి కుటుంబ సభ్యుల్లో ఉన్న అపోహలను తొలగించాలని సూచించారు. వైద్యపరంగా అత్యవసరమైన పరిస్థితుల్లో మాత్రమే సిజేరియన్ ఆపరేషన్లు చేయాలని, సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని వైద్యులు, గర్భిణులు, వారి కుటుంబ సభ్యులకు విజ్ఞప్తి చేశారు. తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణకు వైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్య భద్రతకు పోలియో చుక్కలు ఎంతో కీలకం అని అన్నారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన జిల్లాల్లో నవంబర్ 22 నుంచి 24వ తేదీ వరకు మూడు రోజుల పాటు పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, తెలంగాణ రాష్ట్రంలో ఎంపిక చేసిన ఐదు జిల్లాల్లో హనుమకొండ జిల్లా కూడా ఉండటం సంతోషకరమని తెలిపారు.జిల్లాలో సుమారు 84 వేల మంది ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందుకోసం 497 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్య, వైద్య రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ పోలియో రహిత సమాజ నిర్మాణంలో భాగంగా ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలను వేయించాలని సూచించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈవీ శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య,వివిధ శాఖల అధికారులు, వైద్యులు,వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా కార్తీక వనభోజనాలు -- ఆత్మీయ సమ్మేళనం

బ్రాహ్మణ ఐకమత్యానికి, ఆత్మీయ అనుబంధాలకు వేదికగా నిలిచిన కార్యక్రమం

అతిథులు, దాతలకు ఘన సత్కారం -- సంఘ భవన నిర్మాణానికి సహకార హామీలు



నిజం న్యూస్ కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 22 2026: మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 130వ డివిజన్ సుభాష్ నగర్ పరిధిలోని అపురూప కాలనీలో ప్రశాంత వనము ఫారెస్ట్ బ్లాక్ పార్క్ వద్ద శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో సంఘ అధ్యక్షులు గోగులపాటి కృష్ణమోహన్ అధ్యక్షతన కార్తీక వనభోజనాలు -- ఆత్మీయ సమ్మేళనం 2026 కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తి, సంప్రదాయం, సాంస్కృతిక వైభవం, కుటుంబ ఆత్మీయత వెల్లివిరిశాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ బ్రాహ్మణ సమాజ సంక్షేమానికి తన వంతు కృషి ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. సంఘ భవన నిర్మాణానికి అవసరమైన భూసేకరణ విషయంలో తన సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం క్యాలెండర్లు, పంచాంగాల పంపిణీ, ఆరోగ్య శిబిరాలు తదితర అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ వనభోజనాలకు శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం చక్కటి నిర్వచనం ఇచ్చిందని, ప్రకృతి ఒడిలో కుటుంబ సమేతంగా నిర్వహించే ఇలాంటి కార్యక్రమాలు ఆనందాన్ని, ఆత్మీయతను పంచుతాయని అన్నారు. సంఘానికి సొంత భవనం ఏర్పాటు చేసుకునే విషయంలో తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం శుభపరిణామమని పేర్కొన్నారు. మాజీ కేంద్ర మంత్రి, కాంగ్రెస్ నాయకులు సముద్రాల వేణుగోపాలచారి మాట్లాడుతూ బ్రాహ్మణుల సంక్షేమానికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించి, వారికి ప్రయోజనాలు అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంఘం చేపడుతున్న కార్యక్రమాలపై హర్షం వ్యక్తం చేశారు. బ్రాహ్మిన్స్ ఆర్గనైజేషన్ ఫర్ సోషల్ సర్వీసెస్ (బీఓఎస్) చైర్మన్ జనగామ నాగరాజు, బడంగ్‌పేట--రంగారెడ్డి జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మంగు రాఘవరావు, బోడుప్పల్ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు తదితర ప్రముఖులు పాల్గొని సంఘం నిర్వహిస్తున్న వనభోజనాలు, ఆత్మీయ సమ్మేళనాన్ని అభినందించారు. బ్రాహ్మణ కుటుంబాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఐకమత్యాన్ని చాటుతున్న ఈ కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మేడ్చల్ జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ వేణుమాధవ్, కొంపల్లి మున్సిపల్ కమిషనర్ లావణ్య మాట్లాడుతూ కార్తీక వనభోజనాలు -- ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని, కుటుంబ సభ్యులు, సమాజ ప్రముఖులు ఒకచోట చేరి ఆత్మీయతను పంచుకునే ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అభినందనీయమని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్ మాట్లాడుతూ బ్రాహ్మణ సమాజ అభ్యున్నతి, సంక్షేమం, ఐకమత్యం కోసం ప్రతి ఒక్కరూ సంఘటితంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. బ్రాహ్మణుల సంక్షేమ కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు సొంత భవనం ఎంతో అవసరమని, భూసేకరణ కోసం సంఘం తన వంతు ప్రయత్నాలు కొనసాగిస్తోందని తెలిపారు. ఈ లక్ష్య సాధనకు నాయకులు, ప్రముఖులు, సంఘ సభ్యులు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్తీక వనభోజనాల్లో భాగంగా శివపార్వతుల కళ్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. చిన్నారులు దిత్య శృతి పాటిల్, మహతి, వరలక్ష్మి సాయి పుష్కల, పర్ణిక తదితరులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు, సుజాత ఆలపించిన భక్తి కీర్తనలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారుల కళాప్రదర్శనలు, సంగీత కార్యక్రమాలతో ఆత్మీయ సమ్మేళనం ఆనందోత్సాహాల మధ్య సాగింది. కార్యక్రమానికి విచ్చేసిన అతిథులు, దాతలు, సంఘానికి సహకరించిన ప్రముఖులను సంఘం తరఫున ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. సత్కారం అందుకున్న వారిలో టీవీఆర్ విద్యాసంస్థల అధినేత కోటిరెడ్డి, మోచర్ల రవిశంకర్, సీనియర్ జర్నలిస్ట్ సుధీర్ మంకాల, రత్నమాల--సుబ్బారావు, పరశురామ శర్మ దంపతులు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన సలహాదారు సర్వేపల్లి రమేష్ కుమార్ -- లక్ష్మీ కుమారి దంపతుల 25వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానందతో పాటు సంఘం ఆధ్వర్యంలో వారిని ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.కార్తీక వనభోజనాల వంటి ఆత్మీయ కార్యక్రమాలు కుటుంబాల మధ్య అనుబంధాలను పెంపొందించడంతో పాటు సమాజంలో ఐకమత్యాన్ని, సంఘటిత శక్తిని బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు బ్రాహ్మణ కుటుంబాలు మరింత అధిక సంఖ్యలో హాజరై సంఘం బలోపేతానికి తోడ్పడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు గడ్డం రుచిత రాంబాబు, చక్రధారి శ్రీరామ శర్మ, గీత శ్రీధరాచార్యులు, హరి రాఘవేంద్ర, హైమ శివభాస్కర్, సంజీవరావు, అచ్యుతుని ఫణీంద్ర, సాయిరాం, మహిళా సభ్యులు లక్ష్మీ కుమారి, శ్రావణి, సుందరి, మాధవి, చిన్నారులు దిత్య శృతి పాటిల్, మహతి, వరలక్ష్మి సాయి పుష్కల, పర్ణిక, కీర్తనలు ఆలపించిన సుజాత తదితరులు పాల్గొన్నారు. కార్తీక వనభోజనాలు కేవలం భోజన కార్యక్రమంగా కాకుండా బ్రాహ్మణ కుటుంబాల ఐకమత్యానికి, పరస్పర పరిచయాలకు, సాంస్కృతిక పరిరక్షణకు, సేవా భావానికి ప్రతీకగా నిలిచాయి. కార్యక్రమానికి విచ్చేసిన అతిథులు, దాతలు, కుటుంబ సభ్యులు, మహిళలు, చిన్నారులు, సంఘ సభ్యులందరికీ శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది. ప్రతి ఒక్కరి సహకారం, భాగస్వామ్యం, ఆత్మీయతే ఈ కార్యక్రమ విజయానికి ప్రధాన కారణమని సంఘం పేర్కొంది.





నిజం
దృష్టి తెలుగు న్యూస్
TG/TEL/25/A3731

తెల్ల అన్నం తింటే నిజంగానే షుగర్ వస్తుందా?

తరతరాలుగా అన్నం తిన్న మన పెద్దలకు లేని సమస్య.. నేటి తరంలో ఎందుకు పెరుగుతోంది?

అన్నం విషమా? లేక మారిన జీవనశైలే అసలు కారణమా? వైద్యులు చెబుతున్న అసలు నిజాలపై ప్రత్యేక కథనం!



నిజం న్యూస్ హైదరాబాద్, నవంబర్ 22,2026:

మన భారతీయుల జీవితంలో అన్నానికి ఎంతో ప్రత్యేక స్థానం ఉంది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఉదయం, మధ్యాహ్నం, రాత్రి భోజనంలో అన్నం ఉండాల్సిందే. తరతరాలుగా మన పెద్దలు తెల్ల అన్నం తింటూనే జీవించారు. పొలం పనులు చేసేవారు, శారీరక శ్రమ చేసేవారు, ఎక్కువ వయస్సు వరకు ఆరోగ్యంగా జీవించినవారు కూడా అన్నాన్నే ప్రధాన ఆహారంగా తీసుకున్నారు. అయితే ఇప్పుడు పరిస్థితి మారింది. ఎక్కడ చూసినా మధుమేహం (డయాబెటిస్) కేసులు పెరుగుతున్నాయి. వైద్యులు, పోషకాహార నిపుణులు తెల్ల అన్నం ఎక్కువగా తినవద్దని, పరిమాణం తగ్గించుకోవాలని సూచిస్తున్నారు.

దీంతో సామాన్య ప్రజల్లో ఒక ప్రశ్న తలెత్తుతోంది. అసలు తెల్ల అన్నం తింటే షుగర్ వస్తుందా? అన్నం తినడమే తప్పా? మన పూర్వీకులకు రాని సమస్య ఇప్పుడు మనకే ఎందుకు వస్తోంది?

1. తెల్ల అన్నం తింటే శరీరంలో ఏం జరుగుతుంది?

మనం తినే తెల్ల అన్నంలో ప్రధానంగా కార్బోహైడ్రేట్లు ఉంటాయి. అన్నం జీర్ణమైనప్పుడు అవి గ్లూకోజ్‌గా మారి రక్తంలోకి చేరతాయి. అప్పుడు క్లోమగ్రంథి ఇన్సులిన్ అనే హార్మోన్‌ను విడుదల చేస్తుంది. ఈ ఇన్సులిన్ రక్తంలోని గ్లూకోజ్‌ను శరీర కణాలు ఉపయోగించుకునేలా సహాయపడుతుంది.

కానీ కొంతమందిలో శరీర కణాలు ఇన్సులిన్‌కు సరిగ్గా స్పందించవు. దీనినే ఇన్సులిన్ రెసిస్టెన్స్ అంటారు. ఫలితంగా రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగే అవకాశం ఉంటుంది.

అయితే అన్నం తిన్న ప్రతి ఒక్కరికీ షుగర్ వస్తుందని అనుకోవడం తప్పు. తెల్ల అన్నాన్ని అధికంగా, తరచుగా తీసుకోవడం కొంతమందిలో టైప్-2 మధుమేహం వచ్చే ప్రమాదంతో సంబంధం కలిగి ఉండవచ్చు.

2. తెల్ల అన్నం ఎందుకు తగ్గించమంటున్నారు?

వరి ధాన్యాన్ని పాలిష్ చేసే సమయంలో పైపొరలు తొలగిపోతాయి. దీనివల్ల పీచు పదార్థం, కొన్ని విటమిన్లు, ఖనిజాలు తగ్గుతాయి.

తెల్ల అన్నం త్వరగా జీర్ణమై రక్తంలో గ్లూకోజ్ స్థాయిని వేగంగా పెంచవచ్చు. దీనిని అంచనా వేయడానికి గ్లైసెమిక్ ఇండెక్స్ (GI) అనే కొలమానం ఉపయోగిస్తారు.

అయితే బియ్యం రకం, వండే విధానం, అన్నం మెత్తదనం, తినే పరిమాణాన్ని బట్టి ఈ ప్రభావం మారుతుంది.

3. మన పూర్వీకులు అన్నం తిన్నా ఎందుకు షుగర్ సమస్య తక్కువగా కనిపించేది?

ఇది చాలా ఆసక్తికరమైన ప్రశ్న!

మన పెద్దల జీవనశైలికి, నేటి జీవనశైలికి చాలా తేడా ఉంది.

అప్పట్లో వ్యవసాయ పనులు, నడక, శారీరక శ్రమ ఎక్కువగా ఉండేవి. ఇంట్లో వండిన ఆహారమే ఎక్కువగా తినేవారు. ప్యాకెట్ ఆహారాలు, చక్కెర పానీయాల వినియోగం తక్కువగా ఉండేది.

కానీ ఇప్పుడు గంటల తరబడి కూర్చుని పనిచేయడం, వ్యాయామం తగ్గిపోవడం, అధిక కేలరీల ఆహారం, స్వీట్లు, కూల్‌డ్రింక్స్, నిద్రలేమి, ఒత్తిడి, అధిక బరువు వంటి సమస్యలు పెరిగాయి. అలాగే అప్పట్లో మధుమేహాన్ని గుర్తించే పరీక్షలు, వైద్య సదుపాయాలు ఇప్పటిలా అందుబాటులో ఉండేవి కావు. అందువల్ల మన పూర్వీకులకు షుగర్ అసలు లేదని చెప్పడం కూడా సరైంది కాదు.

4. పరిశోధనలు ఏం చెబుతున్నాయి?

2012లో బ్రిటిష్ మెడికల్ జర్నల్‌లో ప్రచురితమైన పరిశోధనలో తెల్ల బియ్యం అధికంగా తీసుకునే వారిలో టైప్-2 మధుమేహం వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. ముఖ్యంగా ఆసియా జనాభాలో ఈ సంబంధం ఎక్కువగా కనిపించింది.

అయితే ఈ పరిశోధనలు తెల్ల బియ్యం వినియోగానికి, మధుమేహ ప్రమాదానికి మధ్య సంబంధాన్ని చూపిస్తున్నాయి. అన్నం ఒక్కటే మధుమేహానికి కారణమని నిరూపించడం లేదు.

5. తెల్ల అన్నం మానేయాలా? బ్రౌన్ రైస్ తినాలా?

షుగర్ రాకూడదంటే అన్నం పూర్తిగా మానేయాలని అనుకోవడం సరైన పద్ధతి కాదు. అలాగే బ్రౌన్ రైస్ తింటే షుగర్ రాదని భావించడం కూడా అపోహే. తెల్ల అన్నం కంటే బ్రౌన్ రైస్‌లో పీచు పదార్థం ఎక్కువగా ఉంటుంది. కొన్ని రకాల పార్బాయిల్డ్ బియ్యం కూడా మంచి ప్రత్యామ్నాయంగా ఉండవచ్చు. చిరుధాన్యాలు, పప్పులు, ఆకుకూరలు, కూరగాయలను కూడా ఆహారంలో చేర్చుకోవడం మంచిది.

ఏ రకమైన బియ్యం తిన్నా పరిమాణం ముఖ్యం. సమతుల్యమైన ఆహారం తీసుకోవడమే అసలు లక్ష్యం.

6. అన్నం తినేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

1. ప్లేటు నిండా అన్నం పెట్టుకుని తినే అలవాటు తగ్గించుకోవాలి.
2. అన్నంతో పాటు ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి.
3. పప్పు, గుడ్లు, పెరుగు వంటి ప్రోటీన్ ఆహారాలను తగిన విధంగా చేర్చుకోవాలి.
4. భోజనం తర్వాత వీలైతే 10 నుంచి 15 నిమిషాలు నడవాలి.
5. ప్రతిరోజూ శారీరక వ్యాయామం చేయాలి.
6. స్వీట్లు, కూల్‌డ్రింక్స్, అధిక చక్కెర పానీయాలను తగ్గించాలి.
7. శరీర బరువు, నిద్రపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.

7. ఇప్పటికే షుగర్ ఉన్నవారు అన్నం తినవచ్చా?

తినవచ్చు. అయితే వారి రక్తంలో చక్కెర స్థాయిలు, మందులు, శారీరక శ్రమ, ఇతర ఆరోగ్య పరిస్థితులను బట్టి అన్నం పరిమాణాన్ని వైద్యుడు లేదా డైటీషియన్ సూచించాలి.

అవసరమైతే ఫాస్టింగ్ బ్లడ్ షుగర్, భోజనం తర్వాత బ్లడ్ షుగర్, ఎహా1ఇ పరీక్షలు చేయించుకోవాలి. వైద్యుల సలహా లేకుండా మందులు ఆపకూడదు.

8. మరి అసలు అన్నం విషమా? వైద్యులు ఎందుకు తగ్గించమంటున్నారు?

ఇదే ఈ కథనంలో అత్యంత ముఖ్యమైన విషయం. అన్నం విషం కాదు. తెల్ల అన్నం తిన్నంత మాత్రాన మధుమేహం వస్తుందని చెప్పడం శాస్త్రీయంగా సరైనది కాదు.

కానీ తెల్ల అన్నాన్ని అధికంగా తీసుకుంటూ, శారీరక శ్రమ లేకుండా, కూరగాయలు, పప్పులు, పీచు పదార్థాలు తక్కువగా తీసుకుంటే ఆరోగ్యపరమైన సమస్యలు పెరిగే అవకాశం ఉంటుంది.

అందుకే వైద్యులు అన్నం పూర్తిగా మానేయమని కాకుండా, పరిమాణాన్ని నియంత్రించుకోవాలని, సమతుల్యమైన ఆహారం తీసుకోవాలని సూచిస్తున్నారు.

ప్రజలకు మనం చెప్పాల్సిన అసలు సందేశం!

అన్నం మన సంస్కృతి.. ఆరోగ్యకరమైన ఆహారం మన బాధ్యత!

మన పూర్వీకులు అన్నం తిన్నారు కాబట్టి మనమూ ఎంతైనా తినవచ్చని అనుకోవద్దు. అలాగే షుగర్ వస్తుందని భయపడి అన్నాన్ని పూర్తిగా వదిలేయాల్సిన అవసరం కూడా లేదు.

మన శరీరానికి అవసరమైన ఆహారం తీసుకోవాలి. పరిమితి పాటించాలి. శారీరక శ్రమ చేయాలి. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి.

గుర్తుంచుకోండి.. ఆరోగ్యానికి శత్రువు అన్నం ఒక్కటే కాదు. అసమతుల్యమైన ఆహారం, అతిగా తినడం, వ్యాయామం లేకపోవడం, మారిన జీవనశైలి కూడా ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి.

అన్నం తిందాం.. ఆరోగ్యంగా ఉందాం.. అపోహలకు దూరంగా ఉందాం!

అక్షర సత్యం । ఆరోగ్యం -- ప్రత్యేక కథనం

ప్రజలకు నిజాలు తెలియాలి.. ఆరోగ్యంపై అవగాహన పెరగాలి.

Ho no:LIG-32,, Ph No:- 9247842354, 9059207979,near water tank, Bharat Nagar colony, moos-apet, Hyderabad, pin code 500018.